698) బౌళి

ప|| కన్నదేటిదో విన్నదేటిదో కాగలదిక నేదో |
నన్ను గానను నిన్నుం గానను నడుమ బట్టబయలు ||

చ|| నీమాయమహిమో నే నేరనికడమో |
భూమిలోన నీవున్నాడవు నాపుట్టుగులు గలవు |
యేమి గాగలనో యింకా మీదట నిటకతొల్లి యేమైతినో |
సోమార్కుల వుదయాస్తమయంబులు చూచుచున్నాడను నేను ||

చ|| జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో |
నీనామంబులు అనంతకోట్లు నిలుకడగాను |
కానగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో |
కానరాని యీ ముక్కున నూర్పులు కాలము గొలచేటికుంచములు ||

చ|| నీకు నీవే నను దయ దలచితివో నేనాచార్యుని నమ్మితివో |
కైకొని నాయంతర్యామివి నిను గంటి నిపుడే నేను |
శ్రీకాంతుడువో శ్రీవేంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము |
యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు ||